# నేటి నిజం - 'విజయ్' విజయం



ఎం. వి. సోమేశ్వర్లు
తెలుగు పండిట్
సి.ఎస్.ఐ. ఉన్నత పాఠశాల
కంఠేశ్వర్, నిజామాబాద్.

తాతలు నేతులు తాగిన సంగతులకు విలువనివ్వక, ఊహల్లో విహరిస్తూ ఆకాశానికి నిచ్చెనలు వేయ కుండా 'నేడే శాశ్వతం - నేడేనిజం' అనే నమ్మకంతో భూత భవిష్యత్తులను గూర్చి ఆలోచించకుండా వర్తమానమే శాశ్వత మనుకోవడమే విజయ్ విద్యా సంస్థ విజయ రహస్యం.

ఈ నిత్యనూతన శర్వాణి - 25వ పుట్టిన రోజు వేడుకను పురస్కరించుకొని ఆ సంస్థలో పనిచేసిన వ్యక్తిగా నాబాధ్యతను నిర్వర్తించకపోతే నామనసు కృతఘ్నుడని నన్ను నిందిస్తుంది.

12-6-1987 నుండి 20-2-1990 వరకు విజయ పబ్లిక్ స్కూల్‌లో తెలుగు పండితునిగా పనిచేసిన నేను ఈ సంస్థ నుంచి అనేక విషయాలు నేర్చుకున్న ఒక విద్యార్థిని.

ఈ విద్యా సంస్థలో చదివిన విద్యార్థులు ఉన్నతశిఖరాలు అధిరోహించడం ఎంత వాస్తవమో, అనేక మంది ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో స్థిరపడడం అంతే వాస్తవం.

**విద్యాచైతన్యానికి శ్రీకారం** - జిల్లాలో అంతకు ముందు విద్యాసంస్థలున్నప్పటికీ అవి సాధారణంగా ఉండేవి. కాని 'విజయ్' తన ఆవిర్భావంతో విద్యాసంస్థల స్థాపనలో నూతన చైతన్యానికి నాంది పలికింది, ఒక ఎగ్జాంపుల్‌గా నిలిచింది. వివిధ విద్యాలయాలు 'విజయ్' ని అనుసరించి ముందుకు వస్తే వచ్చుండవచ్చునేమోగాని విజయపథానికి దరిచేర లేకపోవడం ఆ సంస్థ యాజమాన్య కృషికి నిదర్శనం. ఇవి కేవలం ఆషామాషీగా వచ్చిన కీర్తి ప్రతిష్టలు కావు, పట్టుదల, శ్రమ, నిబద్ధత ఖచ్చితత్వం, సంఘీభావం, ఏకాగ్రత... ఇవీ వీరి విజయానికి కారణాలు!

ఇంతటి విజయానికి ముందు దక్షులై నిలిచిన వ్యక్తి -అమృతలత!

తాను ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ తన ఆలోచనలు, విధానాలు అమలు చేయలేక వాటికోసం పరితపించి - వాటికి వాస్తవరూపం ఇస్తూ నిర్మించిన ఈ కుటీరం నేడు వందల మందికి ఆశ్రయాన్ని వ్వడంతో పాటు, వేల మందిని తీర్చిదిద్దుతోంది. నాటి నుండి నేటి వరకూ ప్రతి అడుగునూ మొదటి అడుగుగానే భావిస్తూ నూతనత్వానికి నాంది పలుకుతున్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల బాధ్యత అయితే, ఉపాధ్యాయులను తీర్చిదిద్దే బాధ్యత అమృతలత మేడమ్ స్వీకరించి ఎందరినో పోస్ట్‌గ్రాడ్యుయేట్ (పి. జీ) ల స్థాయికి తీసుకొచ్చారు. వారిలో శ్రీయుతులు ప్రభాదేవి, వసంత, సుజాత, కవిత లు ప్రత్యక్షంగా కనబడితే పరోక్షంగా స్ఫూర్తిని పొందినవారు ఎందరో, ఎందరెందరో !

**'విజయ్'లో పనిచేయడం సులభం** - పనిచేయా లనే సంకల్పంతో పాటూ, విధినిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం లేకపోతే 'విజయ్' లో పనిచేయడం సులభతరమే కాదు తృప్తిని కూడా యిస్తుంది. ఉపాధ్యాయుడికి కనీస బాధ్యతలు నిర్వర్తించగలిగే శక్తి సామర్థ్యాలుంటే చాలు, అతడికి 'విజయ్'లో మంచి తర్ఫీదు దొరుకుతుంది!

చదువు చెప్పడంతో పాటు మనలో ఉన్న శక్తి సామర్థ్యాలను ప్రదర్శించడానికి అవకాశమిచ్చి ప్రోత్సహించే సంస్థ 'విజయ్'.

**వార్షికోత్సవాలకు నేటికీ సరిలేరెవ్వరు.** - పాఠశాల వార్షికోత్సవాలు నిర్వహించడంలో 'విజయ్'కు సాటి లేరని అనడంలో అతిశయోక్తి గాదు. అనేక విద్యాసంస్థలు వార్షికోత్సవాలలో- 'విజయ్'ని అనుకరింపజూస్తాయి కానీ అలా చేయలేమని చెప్పుకోడానికి ఈగో అడ్డమొస్తుంది. ముఖ్యంగా తమ వార్షికోత్సవాలకి 'టాలెంట్ షో' అని చెప్పడమే ఒక అద్భుతం. ఎవరి టాలెంట్ అంటే - అందరిది! అందరిదీ అంటే - విద్యార్థులదీ, ఉపాధ్యాయులదీ, యాజమాన్యందీ!

**పాఠశాల నిర్వహణ** - ప్రభుత్వ నిర్ణయాలను సక్రమంగా అమలుచేస్తూ ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న సంస్థ. త్రిభాషాసూత్రాన్ని అమలు పరుస్తూ శ్రవణం, భాషణం, పఠనం, లేఖనమనే చతుర్విధ ప్రక్రియలలో రాణించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దే సంస్థ.

ఫలితాలకోసం పడరాని పాట్లు పడకుండా, బాధ్యతలో నిర్లక్ష్యం లేకుండా చేయడం, చేయించడమే విజయ విద్యార్థుల ఉత్తీర్ణతకు మూలాధారం.

ఆంగ్ల మాధ్యమంలో చదివే విద్యార్థులకు తెలుగు, హిందీ విషయాలలో చాలావీక్‌గా ఉంటారనేది లోక ధర్మంగా చాలా సహజంగా (మనసులో గొప్పగా ఫీలౌతూ) చెబుతుంటారు.

కాని 'విజయ్'లోని విద్యార్థులు తెలుగు, హిందీ మాధ్యమాలలోని విద్యార్థులతో సమానంగా రాణించ గలరని చెప్పడానికి సందేహించను.

**సిలబస్ - పాఠ్యపుస్తకాలు** - ఎన్నో పుస్తకాలు, ఉంటేనే పాఠశాలగా భావిస్తారనే ప్రస్తుత రోజుల్లో ప్రభుత్వ సిలబస్‌ను అనుసరించి మాత్రమే విద్యాబోధన ఈ విద్యాసంస్థలో జరుగుతుంది. ముఖ్యంగా 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన సిలబస్ తప్ప మరేదీ కనీసం అలంకరణ కోసమైనా జతచేయరు. (అవసరంలేదు కూడా) వాటిలో విద్యార్థులను నిష్ణాతులను చేస్తే చాలు, ఉన్నత ఫలితాలు సాధిస్తారనేది 'విజయ్' నమ్మకం. ఏనంవత్సరానికా నంవత్సరం రుజువౌతోంది కూడా.

**క్రీడలు - సాంస్కృతిక శిక్షణ** - రిజల్టే ధ్యేయంగా, ర్యాంకులే లక్ష్యంగా మారుతోన్న నేటి కార్పొరేట్ విద్యావిధానంలో విద్యార్థి సిలబస్‌కే పరిమితమవడం, ప్లే గ్రౌండ్‌ను టి.వీ.లో చూస్తూ ఆనందించడం, సాంస్కృతిక కార్యక్రమాలంటే ఏమిటి అనే ప్రశ్నవేసే దౌర్భాగ్య స్థితి 'విజయ్' విద్యార్థులకు లేకపోవడం సుకృతంగా భావించవచ్చు. ఈనాడు అనేక కాన్సెప్ట్, గ్లోబల్ ఇంటర్నేషనల్ తదితర పేర్లతో వెలుస్తోన్న విద్యాసంస్థల కన్నా - ఎన్నో ఏళ్ళ ముందుగా - ఆస్థాయిలో పాతికేళ్ళ క్రితమే 'విజయ్' ఆలోచించి - విద్యార్థి సంపూర్ణ వికాసానికి చేయూత నిచ్చే విద్యా విధానాన్ని అమలులోనికి తెచ్చింది!

కరెస్పాండెంట్ శ్రీమతి ప్రభాదేవి గారి నిర్మోహ మాటం, సమయస్ఫూర్తితో కూడిన చురుకుదనం, పనియందు ఉత్సాహాన్ని కల్గిస్తే, ప్రిన్సిపాల్ శ్రీమతి వసంత సాత్వికంగా బాధ్యతను గుర్తుకు తీసుకొస్తారు. వైస్‌ప్రిన్సిపల్ శ్రీమతి.సుజాత సౌమనస్యంతో పాఠశాల ప్రణాళికలు అమలు జరుగుతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆదర్శవంతమైన యాజమాన్యా నికి ప్రతీక "ఐడియల్ ఎడ్యుకేషన్ సొసైటీ".

ఇంత ఉన్నతమైన విద్యాసంస్థలో పనిజేసిన నాకు ఎల్లవేళలా నాటి రోజులు గుర్తుకు వస్తూ ఉంటాయి. ఆర్మూర్ నిజామాబాద్. సంస్థలలో పనిచేసే సిబ్బందికి పోటీలు నిర్వహించడం, మాదిరి తరగతులు నిర్వహించడం, క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాల బాధ్యతలు, విమర్శలను స్వీకరించడం, పోటాపోటీగా తరగతులు తీసుకోవడం ఇదంతా సుహృద్భావ వాతవరణంలో జరగడం మానసిక సంతృప్తిని గుర్తుకు తెస్తుంది.

'విజయ్'లో చదివిన విద్యార్థి ఉన్నత శిఖరాలధి రోహిస్తే, విజయ్‌లో పనిచేసిన ఉపాధ్యాయుడు ఉన్నతంగా చూడబడడం - ఆ సంస్థ ప్రత్యేకత !

ఇదంతా ఎవరి మెప్పుకోసమో రాసిందనుకుంటే అది వారి వ్యక్తిత్వానికి వదిలేస్తాను. ఇదినా అనుభవాల ఆనందానుభూతిని కొన్ని సిరా చుక్కలతో తెలియజేశాననే సంతృప్తి కోసమే !

మెరుపు మెరిస్తే - వాన కురిస్తే
ఆకసాన హరివిల్లు విరిస్తే
అది మీకే అని ఆనందించే కూనల్లారా !

మీదే మీదే సమస్త విశ్వం -
మీరే భారత భాగ్యవిధాతలు !
మీ హాసంతో మెరుగులు తీరును -
వచ్చేనాళ్ళ విభా ప్రభాతములు!

-శ్రీ శ్రీ